ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- లేకపోతే ప్రభుత్వాన్ని గద్దె దించక తప్పదు
- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి మోహన్‌రెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

కోటగిరి, ఫిబ్రవరి 4 : ప్రభుత్వ ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే ప్రభుత్వాన్ని గద్దె దించడం తప్పదని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి మోహన్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం గంట్ల గంగాధర్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు సంబంధించి గతేడాది మే, 2024 నుంచి అన్ని రకాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సైతం బెనిఫిట్స్ రావడం లేదని వాపోయారు. రాష్ట్రప్రభుత్వం బెనిఫిట్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గంగోని కిషన్, జిల్లా మాజీ అధ్యక్షుడు ఇల్తెపు శంకర్, కోటగిరి, పొతంగల్, మోస్రా ఎంఈవోలు శ్రీనివాసరావు, లోల శంకర్, నాగ్‌నాథ్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బర్ల సాయిలు, ప్రధానకార్యదర్శి ఉదయ్‌చంద్ర, శానం సాయిలు, గంగరాజులు, సుధీర్, రవీందర్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

కోటగిరి, ఫిబ్రవరి 4 : నీటి సరఫరా పైప్‌లైన్లకు లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలని, వేసవికాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఎంపీవో చందర్ అన్నారు. మండలంలోని ఎత్తొండ, ఎత్తొండ క్యాంప్‌లో ఆయన మంగళవారం పర్యటించారు. పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేయించారు. అనంతం అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి ఉమాకాంత్, రాజేశ్వరి, లలిత, గంగాధర్ పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం

సిరికొండ, ఫిబ్రవరి 4 : ఎంపీడీవవో కార్యాలయంలో సప్లిమెంటరీ ఓటరు లిస్ట్‌కు సంబంధించి అఖిలపక్ష పార్టీలతో ఎంపీడీవో మనోహర్‌రెడ్డి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా వచ్చిన ఓటరు జాబితాలో 302 ఓటర్లు నమోదు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి గొల్ల ఎర్రన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బకరం రవి, బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవ్, రాంచందర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

మోస్రా (చందూర్), ఫిబ్రవరి 4 : మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తహసీల్దార్ మారుతి మంగళవారం తనిఖీ చేశారు. చిన్నారులకు అందజేస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందజేయాలని కేంద్రం నిర్వాహకురాలు పుష్పలతకు సూచించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఇరుకు గదిలోకి తపాలా కార్యాలయం మార్పు

- వినియోగదారులకు ఇక్కట్లు

మండల పరిషత్ కార్యాలయంగా మారిన తపాలా కార్యాలయం

ఇరుకుగా ఉండే గల్లీలో అద్దె ఇంట్లో తపాలా కార్యాలయం

పొతంగల్, ఫిబ్రవరి 4 : మండల కేంద్రంలోని చావిడి వద్ద తపాలా కార్యాలయం విశాలంగా ఉండేది. ఎంతమంది వినియోగదారులు వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా సేవలందించేవారు. పొతంగల్ నూతన మండలం కావడం, ఎంపీడీవోను నియమించడంతో విశాలంగా ఉన్న తపాలా కార్యాలయాన్ని ఎంపీడీవో కార్యాలయంగా వినియోగించాలని నిర్ణయించారు. దీంతో నాలుగు రోజుల క్రితం తపాలా కార్యాలయాన్ని మండలకేంద్రంలోని ఓ గల్లీలోని ఇరుకు గదిలోకి మార్చారు. తపాలా కార్యాలయాన్ని ఇరుకుగా ఉన్న అద్దె గదిలోకి మార్చడంపై ఖాతాదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పొతంగల్ గ్రామంలో ప్రతి నెలా సుమారు వెయ్యి మంది వివిధ రకాల పెన్షన్‌దారులు పోస్టాఫీస్‌కి వచ్చి డబ్బులు తీసుకుంటారు. రానున్న వేసవిలో, ఇరుకు గదిలో ఇబ్బందులు ఎదుర్కొంటారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయం అవసరమే అయినప్పటికీ తపాలా కార్యాలయాన్ని మార్చకుండా, వేరే అద్దె గది తీసుకొని నిర్వహిస్తే బాగుంటుందే నని మండల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ భవనంలో ఉన్న షట్టర్‌లోకైనా తపాలా కార్యాలయాన్ని మారిస్తే బాగుంటుందని చర్చించుకుంటున్నారు.

తపాలా కార్యాలయానికి షట్టర్ గది ఇస్తే బాగుంటుంది

తపాలా కార్యాలయాన్ని మార్చిన గది ఇరుకుగా ఉన్నది. కనీసం బల్లపై రాయడానికి, సంబంధిత డాక్యుమెంట్లు పెట్టుకోవడానికి వీలు లేకుండా ఉన్నది. గ్రామ పంచాయతీ భవనంలోని షట్టర్ గదిలోని తపాలా కార్యాలయాన్ని ఇస్తే, ఖాతాదారులకు ఇబ్బంది లేకుండా సేవలు అందించవచ్చు.

- గోపాల్, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్

ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ

సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

ధర్పల్లి, ఫిబ్రవరి 4 : మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని ఇన్‌హౌస్ గ్రామసభగా మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్డీవో సాయాగౌడ్, జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ హాజరై నివేదికలు పరిశీలించారు. అన్ని గ్రామాల్లో కలిపి ఉపాధి కూలీ పరంగా 2 కోట్ల 99 లక్షల 16 వేల 53 రూపాయలు, మెటీరియల్ పనుల పరంగా కోటీ 10 లక్షల 2 వేల 964 రూపాయల పనులకు సంబంధించి వారం రోజులుగా గ్రామాల వారీగా సామాజిక తనిఖీ చేపట్టారు. చిన్నచిన్న అభ్యంతరాలపై ఆయా జీపీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణ, ఎస్ఆర్‌పీ సుశీల, ఎంపీవో రాజేశ్, ఏపీవో వినోద, ఏసీ సంజీవ్, ఏపీఎం సునీత తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి సందర్భంగా బందోబస్తు

పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 4 : నగరలోని నీలకంఠేశ్వర ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకల సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. అదనపు డీసీపీ బస్వారెడ్డి సూచనల మేరకు నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో నగర సీఐ శ్రీనివాస్‌రాజ్ ఆధ్వర్యంలో ఎస్సైలు, స్పెషల్ పార్టీ సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. ఆలయం వద్ద క్యూలైన్ ద్వారా పంపించేలా చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పలు రూట్లలో వాహనాలను మళ్లించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌తో తహసీల్దార్

పొతంగల్, ఫిబ్రవరి 4 : మండలంలోని మంజీరా పరీవాహక ప్రాంతంలో రాత్రి వేళ ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నది. మండలంలోని రెండో బ్రిడ్జి వద్ద సోమవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్ గంగాధర్ పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గతంలో ప్రత్యేక బృందాల ఏర్పాటుతో సత్ఫలితాలు

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఉన్నతాధికారులు గతంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. కొన్ని నెలల పాటు ఈ బృందం రాత్రి వేళ ఇసుక అక్రమ రవాణా చేయకుండా చర్యలు చేపట్టారు. ఆ సమయంలో పనిచేసిన తహసీల్దార్ వెళ్లిపోవడంతో ప్రత్యేక బృందం పనిచేయడం లేదు. దీంతో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను వివిధ ప్రాంతాల్లో డంపులు చేసి, టిప్పర్ల ద్వారా వేరే ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. రాత్రి పూట పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నప్పటికీ ఇసుక ట్రాక్టర్లను పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తాం..

మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ఉన్నాం. త్వరలోనే బృందాన్ని ఏర్పాటు చేస్తాం.

- గంగాధర్, పొతంగల్ తహసీల్దార్

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన

క్యాన్సర్ వ్యాధిని జయించిన వారిని సన్మానిస్తున్న వైద్యులు

ఖలీల్‌వాడి/మాక్లూర్(నందిపేట్)/ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 4 : నగరంలోని ద్వారకానగర్‌లో ఉన్న ఎస్ఎంఆర్ పితామహ క్యాన్సర్ దవాఖానలో ప్రపంచ క్యాన్సర్ దినాన్ని మంగళవారం నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ –నిజామాబాద్ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అజ్జ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధిని తొలి దశలో గుర్తించి, చికిత్స చేయించుకుంటే వ్యాధిని జయించవచ్చని తెలిపారు. క్యాన్సర్‌లో రకాలు, వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. క్యాన్సర్ వ్యాధిని జయించిన పలువురిని వైద్యులు సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్, విక్రమ్‌రెడ్డి, రాజేందర్, శ్రీశైలం, విశాల్, అర్చన, వినోద్‌కుమార్‌గుప్తా, చైతన్యకుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా నందిపేట్ మండల కేంద్రం లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజకుమార్ క్యాన్సర్ వ్యాధికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో లక్ష్మణ్‌శాస్త్రి, విభాగాధిపతులు కిశోర్, లావణ్య, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో వేల్పూర్ మండలం పడగల్‌లో క్యాన్సర్ వ్యాధితో పోరాడి జయించి ఎందరో క్యాన్సర్ రోగులకు ధైర్యాన్ని ఇచ్చిన మహిళను సన్మానించినట్లు అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్ తెలిపారు.

పడగల్‌లో క్యాన్సర్‌ను జయించిన మహిళలను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తానాజీ మాల్సూరేకు నివాళి

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 4: ఛత్రపతి శివాజీ సైన్యంలోని ముఖ్యుడైన తానాజీ మాల్సూరే జయంతిని మంగళవారం బోధన్ పట్టణంలోని పాన్‌గల్లీలోని కాషాయ ధ్వజం వద్ద యువకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఛత్రపతి యువజన సంఘం అధ్యక్షుడు పసులేటి గోపికిషన్ మాట్లాడారు. తానాజీ మాల్సూరే దేశం కోసం, ధర్మం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప వీరుడన్నారు. కార్యక్రమంలో యువకులు భీములు, రాజు, శ్రీను, సన్నీ, చిన్న, రాజు, శివ, చింటు, ఈశ్వర్, నారాయణ, గంగాధర్, నవీన్, సునీల్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మ దహనం

తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రెడ్డి సంఘం సభ్యులు

చందూర్, ఫిబ్రవరి 4 : మండలకేంద్రంలో తీన్మార్ మల్లన్న దిష్టి బొమ్మను చందూర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం దహనం చేశారు. రెడ్డి కులస్తులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

రైలులో నుంచి పడి ఒకరి మృతి

ఇందల్వాయి, ఫిబ్రవరి 4: మండల పరిధిలోని సిర్నాపల్లి శివారులో మంగళవారం సాయంత్రం రైలులో నుంచి పడి ఒకరు మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి వైపు వెళ్తున్న రైలులో నుంచి గుర్తు తెలియని ప్రయాణికుడు కింద పడి మృతిచెందాడు. రైల్వే అధికారులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

చెరువులో పడి మరొకరు..

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 4 : బర్రెను చెరువులో నుంచి బయటికి పంపేందుకు చెరువులోకి దిగిన ఓ వ్యక్తి గల్లంతై మృతిచెందిన ఘటన మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకున్నది. ఎస్సై మహ్మద్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పశువుల కాపరి బియ్యం బాబయ్య (66) అతడి కుమార్తె లక్ష్మితో కలిసి పశువులు మేపేందుకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వస్తుండగా ఒక పశువు చెరువులోకి వెళ్లగా దాన్ని బయటికి కొట్టేందుకు చెరువులోకి దిగి, మట్టిలో ఇరుక్కుని గల్లంతయ్యాడు. బియ్యం బాబయ్య మృతదేహం మంగళవారం లభించింది. మృతుడి భార్య సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 4 : ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7న నిర్వహించే లక్ష డప్పులు.. వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సంపత్, ఎంఎస్ఎఫ్ టీయూ అధ్యక్షుడు దినేశ్ కోరారు. టీయూలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సైమన్ పాల్, నవదీప్, చక్రి యాదవ్, నరేశ్ యాదవ్, సిద్ధార్థ, శేఖర్, ప్రసాద్, నందన్, హర్ష పాల్గొన్నారు.

'ఆశవర్కర్ల సమస్యలను పరిష్కరించాలి'

సిరికొండ, ఫిబ్రవరి 4 : ఆశవర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ కోరారు. ఈ మేరకు మండల వైద్యాధికారి అరవింద్‌కు ఆశవర్కర్లతో మంగళవారం వినతిపత్రం అందజేశారు. జిల్లావ్యాప్తంగా లెప్రసీ సర్వే చేయాలని ఆశకార్యకర్తలకు అధికారులు సూచిస్తున్నారని, పెండింగ్‌లో ఉన్న పల్స్‌పోలియో, లెప్రసీ సర్వే డబ్బులు చెల్లించిన తర్వాతే కొత్త సర్వేలు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకులు రాధ, సువర్ణ, లక్ష్మి, గంగామణి, విజయ, మోహన్, సుమన్, గోవర్ధన్, రేవతి, త్రివేణి, పద్మ పాల్గొన్నారు.

పంటల పరిశీలన

ఏర్గట్ల, ఫ్రిబవరి 4: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ ధికారి వాజీద్ హుస్సేన్ హాజరై కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం ఏర్గట్ల, తాళ్ల రాంపూర్ సొసైటీలను తనిఖీ చేశారు. సహకార సంఘాల్లో ఎరువుల స్టాకు వివరాలను తెలుసుకున్నారు. ఏర్గట్లలో పాలిష్ చేస్తున్న పసుపు, గుమ్మిర్యాల్ గ్రామంలో జొన్న పంటను పరిశీలించారు. ఆయన వెంట ఏవో శేరి వైష్ణవ్, ఏఈవోలు మనీషా, సాయిసచిన్, రైతులు ఉన్నారు.

వరి పంటలో నీటి యాజమాన్యంపై అవగాహన

వేల్పూర్, ఫిబ్రవరి 4: వరి పంటలో నీటి యాజమాన్యం పద్ధతులపై మంగళవారం మండల కేంద్రంలో మండల వ్యవసాయాధికారి శృతి అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫౌండేషన్ ప్రతినిధి చింత శ్రీనివాస్ మాట్లాడుతూ డీఎస్ఆర్ పద్ధతి, తడి, పొడి విధానం, డ్రమ్ సీడర్ విధానంపై అవగాహన కల్పించారు. వరిలో కలుపును తొలగించిన తర్వాత పొట్ట దశ వచ్చే సమయం వరకూ ఎక్కువ నీరు అవసరముండదని, తడి పొడి విధానం పాటించి 45 తడులతో సాగు చేయవచ్చని చెప్పారు. ఈ విధానానికి అవసరమైన ఏడబ్ల్యూడీ పైపులను అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధి చింత శ్రీనివాస్, ఏఈవోలు తిరుమల, సాయిరాం, రాజ్, ప్రశాంత్, షబ్బీర్, స్నేహశ్రీ ఫౌండేషన్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ చింత శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

వేల్పూర్, ఫిబ్రవరి 4: మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న పంటల వివరాల నమోదు ప్రక్రియను మ ండల వ్యవసాయాధికారి ఎస్.శృతి మంగళవారం పరిశీలించారు. మండల కేంద్రంలో ఆమె యాసంగిలో సాగుచేసిన పంటల నమోదు ప్రక్రియ మండలంలోని ప్రతి గ్రామంలో ప్రారంభమైందని, రైతులు సర్వే నంబర్ వారీగా సంబంధిత వ్యవసాయాధికారి వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు. ఏవో వెంట ఈఏవో తిరుమల ఉన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు

బహుమతులతో విద్యార్థులు

మోర్తాడ్, ఫిబ్రవరి4: కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. సీడీపీవో స్వర్ణలత హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థినులకు వ్యాసరచన, డ్రాయింగ్, ఉపన్యాసపోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవో జ్ఞానేశ్వరీ, సూపర్‌వైజర్ గంగహంస, హెచ్ఎం రాజన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మాక్లూర్, ఫిబ్రవరి4: మండలంలోని ముత్యంపల్లి, మానిక్‌బండార్ గ్రామాల్లో మంగళవారం పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవిప్రకాశ్ అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఎడపల్లి పీహెచ్‌సీలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

ఎడపల్లి, ఫిబ్రవరి 4: వైద్యులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్‌లో నమోదు చేసిన రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు అందిస్తున్న చికిత్సపై నర్సులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సమయపాలన పాటిస్తూ, రోగులకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలని అన్నారు. మెడికల్ ఆఫీసర్ శాయిస్త ఫిర్దోస్, ఆయుష్ వైద్యుడు వెంకటేశ్, సూపర్ వైజర్ రాజేశ్వర్, దేవేందర్, ఏఎన్ఎం గంగామణి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 4: శాసన మండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పరిశీలించారు. బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ వికాస్ మహతో పాటు అధికారులకు సూచించారు. పోలింగ్ స్టేషన్ల వద్ద సదుపాయాలను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ విఠల్, ఆర్ఐ వరుణ్, కళాశాల ప్రిన్సిపాల్ ఉన్నారు.

స్వధార్ హోంలో ఆదర్శ వివాహం

ఆదర్శ వివాహం జరిపిస్తున్న అధికారులు

బోధన్, ఫిబ్రవరి 4: బోధన్ పట్టణంలోని శక్తి సదన్ స్వధార్ హోంలో మంగళవారం అధికారులు కులాంతర వివాహం జరిపించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి పద్మావతి ఆదేశాల మేరకు స్వధార్‌హోంలో ఉన్న ఊరడి అక్షయను ఎడపల్లి గ్రామానికి చెందిన బొప్పారం భాస్కర్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఈ వివాహానికి బోధన్ పట్టణ ఏఎస్సై గంగాధర్, స్వధార్ హోం సూపరింటెండెంట్ రూప, సిబ్బంది లక్ష్మీకాంత్, లలిత, స్నేహతో పాటు ఇరు పక్షాలకు చెందిన కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

యాదగిరి సేవలు మరువలేనివి

మోర్తాడ్/శక్కర్‌నగర్/రెంజల్ ఫిబ్రవరి 4: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు యాదగిరి సంస్మరణసభను మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ ప్రజపంథా జిల్లానాయకుడు సారా సురేశ్, డాక్టర్ సత్యనారాయణ, నాయకులు అశోక్, కిషన్, సత్తక్క, బాలయ్య, బాలకిషన్, ఆనంద్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. బోధన్ పట్టణంలోని తెలంగాణ తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో కర్నాటి యాదగిరి సంతాపసభను సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ రాష్ట్ర నాయకుడు ప్రభాకర్ మాట్లాడుతూ యాదగిరి ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి పేదల బతుకుల్లో మార్పు కోసం తుదివరకు పనిచేశారన్నారు. సంతాప సభను పడాల శంకర్ అధ్యక్షతన నిర్వహించగా, నాయకులు బి.మల్లేశ్, బి.నాగమణి, జి. సీతారాం, రెహానా బేగం, నక్క లింగారెడ్డి పాల్గొన్నారు. రెంజల్ మండలంలోని బోర్గాం గ్రామంలో యాదగిరి సంతాప సభను సీపీఐఎంఎల్ ప్రజాపంథ రెంజల్, నవీపేట్ మండలాల నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో గుమ్ముల గంగాధర్, నాగన్న, పార్వతి రాజేశ్వర్, మన్నె పోశెట్టి, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి4: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ అన్నారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. డాక్టర్లు సమయపాలన పాటించాలని, ప్రైవేట్‌కు దీటుగా వైద్యం అందించాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానలోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు.

కబడ్డీ టెక్నికల్ అఫీషియల్‌గా రాజేందర్

మోర్తాడ్, ఫిబ్రవరి 4: ఆదిలాబాద్‌లో మంగళవారం నుంచి ఈనెల 7 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్ కబడ్డీ టోర్నమెంట్‌కు టెక్నికల్ అఫీషియల్‌గా కమ్మర్‌పల్లి మండలం అమీర్‌నగర్ గ్రామానికి చెందిన బెరిగిడి రాజేందర్ ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ లింగయ్య, కార్యదర్శి గంగాధర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. రాజేందర్ ప్రస్తుతం నిజామాబాద్‌లోని కాకతీయ ఒలంపియాడ్ ప్రైవేట్ పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్నాడని తెలిపారు.

రాజకీయ నాయకులతో సమావేశం

మోర్తాడ్, ఫిబ్రవరి 4: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కమ్మర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయపార్టీల ప్రతినిధులతో ఎంపీడీవో రాజశ్రీనివాస్ మంగళవార మండల సమావేశాన్ని నిర్వహించారు. వార్డుల వారిగా గ్రామపంచాయతీల్లో ఓటర్ల వివరాలపై చర్చించారు. కార్యక్రమంలో పార్టీల నాయకులు సుంకెట రవి, సారా సురేశ్ పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేయాలి

వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

బోధన్, ఫిబ్రవరి 4: పట్టణంలో ఆస్తిపన్నుతో పాటు ఇతర పన్నులను మున్సిపల్ సిబ్బంది పూర్తిస్థాయిలో వసూలు చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. మంగళవారం పట్టణంలోని రాకాసీపేట్‌లో పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బందితో ఆయన మాట్లాడారు. మొండి బకాయిలు ఉన